



# తీరని కోరిక

వడలి రాధాకృష్ణ

**లే**మి నీ రెండలో సేదదీరే చిట్టిబాబు బ్రతుకు ఎప్పుడూ గతుకుల గమనంలోనే పయనిస్తోంది. చేస్తున్నది గవర్నమెంట్ లోని దిగువస్థాయి ఉద్యోగం. చిన్న కుటుంబం. అతని కుటుంబంలోని సభ్యులు భార్య లలిత, ఇద్దరు పిల్లలు, కన్న తల్లి. తాతల నాటి నుండి సంక్రమించిన ఆస్థిపాస్తులేమీ పెద్దగా లేకపోయినా, వారి పాత కాలపు వారసత్వం ఆ ఇంట్లో ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. వ్యక్తుల మధ్య ప్రేమాభిమానాలు, ఆత్మీయతానురాగాలు మధ్య తరగతి కుటుంబ వ్యవస్థకు ప్రతీక అయిన చిట్టిబాబు ఇంట్లో కనిపిస్తూ ఉంటాయి. లలిత తనకు తగినట్లుగా చేదోడు వాదోడుగా ఉండే ఇల్లాలు. ఇక అమ్మ అన్నపూర్ణమ్మగారి సంగతి సరేసరి.

తన ఆర్థిక స్థితి అంతంత మాత్రమే అయినా తన వారికి ఎప్పుడూ ఏలోటూ రానివ్వలేదు చిట్టిబాబు. తన మనసెరిగిన భార్య తనని ఇది కావాలని ఎప్పుడూ ఏదీ అడగక పోయినా, ఆమె మనసెరిగిన తాను అడక్కుండానే ఇంట్లో అన్నీ సమకూర్చి పెట్టేవాడు. ఆడదాని మనసును తాను చదవలేక పోయినా మరో ఆడదైన తన తల్లి కోడలి మనసును చదివి వినిపించేది. చిట్టిబాబుకు భార్య అంటే ప్రేమ, అమ్మ అంటే అనురాగం. అందుకే లలిత "నా మొగుడు మనసున్న మనిషి" అనుకుంటే, అమ్మ "ఘనసున్న తన కొడుకు మారాజు" అని మురిసిపోయేది. ప్రాణప్రదంగా ప్రేంచిన తన చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేసి అత్తవారింటికి పంపాడు. తనది ట్రాన్ఫరబుల్ జాబ్ కావడంతో ప్రతి మూడు సంవత్సరాల కొకసారి బదిలీ అయిన ఊరికి షిఫ్ట్ కావడం చిట్టిబాబు జీవితంలో మామూలు విషయమైపోయింది. పాతదైన కొంప చెల్లెళ్ళ మనువు కోసం అమ్మి వేయడంతో సొంత ఇల్లు లేదని అన్నపూర్ణ అప్పుడప్పుడు మధన పడేది.

తల్లి మనసు చదవగలిగిన చిట్టిబాబుకు కనీసం అమ్మ కోసమైనా ఓ ఇల్లు సొంతంగా కట్టాలి. ఆమె బ్రతికి ఉండగా ఆవిడను సంతోష పెట్టాలి అని ఎంతగానో ఆరాట పడేవాడు. కానీ తన చిన్న ఉద్యోగం, ఒకవైపు పిల్లల చదువులు, తల్లి అనారోగ్యం, మరో వైపు కుటుంబ బాధ్యతలు. అతనికి ఇల్లు కట్టడం అనేది ఓ అందని తీయనైన ద్రాక్ష పండులా మిగిలిపోయింది.

బదిలీల మీద ఊరూరా తిరిగే చిట్టిబాబు వెళ్ళిన ప్రతి ఊరిలోనూ అద్దె కొంపల్లో చాలీ చాలని వసతులతో, ఇరుకైన గదుల్లో రాజీపడి జీవనం సాగించేవాడు. తమ తమ అభిరుచికి తగ్గట్టు సొంత ఇల్లు కట్టుకుంటున్న వారిని చూసి మనసులో ఎక్కడో ఒక మూల ఈర్ష్య కలిగినా తన తాహతు ఇంతేలే అని సర్దుకొనేవాడు.

ఏది ఏమైనా కనీసం రిటైర్మెంట్ నాటికైనా తన కంటూ ఓ సొంత గూడు మంచిగాలీ, నీరు గల ప్రదేశంలో నిర్మించుకోవాలి. ఇంటిముందు పోర్టికో, చక్కని డైనింగ్ హాలు దానిలో చూడ చక్కనైన షోకేసు, అభిరుచికి తగ్గట్టు అమ్మకు, తమకు రెండు బెడ్ రూంలు వాటిలో ఎ.సి., స్టోర్ రూం, కిచెన్, పవిత్రంగా ఉండేలా దేముడి గది. ఇల్లంతా చదునైన మార్బుల్ స్టోన్స్ పరిపించాలి. అమ్మ అభిరుచి తన ఇంట్లో ప్రతి బింబించాలి, ఆవిడ ఆనందంగా తన ఇంట్లో తిరిగేలా చేసి కొడుకుగా తన ధర్మం నెరవేర్చాలి. ఇంటికి భార్య పేరున 'లలితా నిలయం' అని పేరు పెట్టాలి. చిట్టిబాబు మనసులోని కోర్కెలు రెక్కలు విప్పి గాలిలో ఎగురుతూంటే లేమితనం అతన్ని వెక్కిరించేది.

* * *

తన నిజాయితీని గుర్తించి అయితేనేమి, తన సీనియారిటీ వల్ల నేమి చిట్టిబాబుకి తను చేస్తున్న ఉద్యోగంలో ఓ చిన్న ప్రమోషన్ వచ్చింది. దానితో ఇక ట్రాన్స్ఫర్సు లేకుండా హెడ్ ఆఫీసులోనే పోస్టింగ్ ఇచ్చారు. కలిసొచ్చే సమయానికి నడిచొచ్చే కొడుకు పుడతాడన్నట్లు హౌసింగ్ లోన్ ఎలిజిబిలిటీ, వెహికిల్ లోన్, ప్రావిడెంట్ ఫండ్‌లోన్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, ప్రమోషన్ బెనిఫిట్స్ అన్నీ కలిపితే ఓ చిన్న ఇల్లు ఏర్పరచుకొనే స్థాయి సంపాదించాడు.

విషయం చెబితే ఇంట్లో భార్య, పిల్లలు, తల్లి ఎంతగానో పొంగిపోయారు. "అబ్బాయి! ఇంత కాలం బదిలీల మీద ఊరు ఊరూ తిరుగుతూ అద్దె కొంపల్లో సర్దుకున్నావురా. ఇక బదిలీలు తప్పాయి. దానితో బాటు మీ ఆఫీసు వాళ్ళు లోన్ కూడా ఇస్తారంటున్నావు, చాలా సంతోషంగా ఉందిరా. నాకంతంలో ప్రాణం ఉండగా ఓ ఇంటికి నీవు ఆసామి కావాలి, ఆ ఇంట్లో పిల్లా పాపలతో నీవు చల్లగా ఉండాలి, దాన్ని నేను కళ్ళారా చూడాలి. ఇదిగో ఈ కొద్దిపాటి బంగారం మాత్రమే నా దగ్గర ఉన్నది. దానిని కూడ అమ్మి ఉపయోగించు" అన్నపూర్ణమ్మగారి మాటలు చిట్టిబాబుకి ఎంతగానో స్ఫూర్తినిచ్చాయి.

"అవునండీ! ఇది టౌను, పిల్లలకి చదువులకి కూడ చాలా సౌకర్యంగా ఉంటుంది. మీ మిగిలిన సర్వీసు కూడ ఈ ఊర్లోనే పూర్తి చేయవలసి ఉంది. అత్తగారి కోరిక కూడ మీ ఇల్లు గురించే. ఆవిడని సొంత ఇంట్లో పెట్టి ఆమె కోరిక నెరవేర్చడం మనధర్మం. కనుక ఇక్కడే చిన్న స్థలం కొనుక్కొని ఓ గూడు ఏర్పరచుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం" లలిత మాటలు కూడ చిట్టిబాబుకి బాగా నచ్చాయి.

వెంటనే డిపార్టుమెంట్ లోన్‌కి అప్లై చేసి తనకు అందుబాటులోని ధరతో స్థలం కొని ఇల్లు కట్టడం ప్రారంభించాడు. తను తన వారు ఏమి అయితే కలలు కన్నారో, ఎలాగ ఉండాలనుకున్నారో అలాగ ప్లాన్ తయారు చేయించాడు.

"డాడీ! నేను మంచిగా చదువుకొని పెద్దయి పెద్ద ఉద్యోగం చేసి మంచి కారు కొంటాను. మరి మన కారుకి పోర్టికో ఏది" కొడుకు మాటలు విని మురిసిపోయాడు.

"నేను పెద్దయ్యాక మెడిసన్ కోర్సు చదివి, మంచి డాక్టరు అయి, నా ప్రాక్టీసు ఇక్కడే పెడతాను. నాన్నా! మరి నా సంగతేమిటి."

"మీ నాన్న అప్పటికి పైన మరో అంతస్తు వేసి క్రింద పోర్షను నీకిస్తాడు లేవే" మనవరాలు తల ప్రేమగా నిమురుతూ చెప్పింది అన్నపూర్ణ.

* * *

అందుబాటులోని బడ్జెట్‌తో అనుకున్నవి అనుకున్నట్లుగా మంచి గాలి నీరు ప్రశాంతమైన వాతావరణంలో చిట్టిబాబు ఇల్లు "లలితా నిలయం" పూర్తయింది. చక్కటి విశాలమైన గదులలో, బహుచక్కటి ఖరీదైన కాలు పెడితే జారి పోతుందా అనేంత నున్నతనంతో, ముఖం చూసుకొని తల దువ్వుకో వచ్చునన్నట్లుండే పాలిష్ తనంతో చక్కని మార్బుల్ స్టోన్స్ ఇల్లంతా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొత్తానికి ఆ "స్వర్గ సీమ"లో చిట్టిబాబు, లలిత గృహప్రవేశం చేస్తూంటే కొడుకు ప్రయోజకత్వాన్ని చూచుకొని మురిసిపోయింది అన్నపూర్ణమ్మగారు.

అద్దె ఇల్లును ఖాళీ చేసి సామాన్లతో తన కొత్త ఇంటిలో చేరాడు చిట్టిబాబు "ఎలాగైనా అద్దె కొంప అద్దె కొంపేరా! సొంత ఇల్లులో ఉన్న ఆనందం తృప్తి అక్కడ ఎలాగ వస్తుంది చెప్పు. ఇక్కడ మనం ఏం చేసుకున్నా, ఎలా మాట్లాడుకున్నా అడిగే వారుండరు. కానీ అద్దె ఇళ్ళలో.... ఎక్కువ సేపు లైట్లు వేస్తే తంటా.... ఎక్కువ నీరు వాడితే తంటా.... గట్టిగా మాట్లాడితే ఇబ్బంది.... చుట్టాలు ఎవరైనా వస్తే మరీనూ.... అదీ ఓనర్సు పక్కన ఉంటే సమస్యలు మరీ ఎక్కువ, ఇల్లు మనకి ఊరికే ఇచ్చినట్లు ఫీలవుతారు. ప్రతిసారీ ఇంటి అద్దె పెంచమని ఊరికే పీడిస్తుంటారు. ట్రాన్స్‌ఫరు అయిన ప్రతి ఊరిలోనూ ఈ విధమైన సమస్యలు ఎన్నెన్నో ఎదుర్కొన్నాము. మొత్తానికి ఆ ఇబ్బందుల నుండి బయటపడినందుకు చాలా ఆనందంగా ఉందిరా. ఈ శుభ సమయంలో నువ్వూ, కోడలు తిరుపతి వెళ్ళి ఏడుకొండలవాడిని దర్శనం చేసుకురండి" తల్లి కళ్ళలోని ఆ మెరుపు చూసి ఎంతో తృప్తి చెందాడు చిట్టిబాబు.

నూతన గృహంలో ఆనందంగా సాగిపోతున్న చిట్టిబాబు కుటుంబంలో ఓ అపశృతి తొంగి చూసింది. జీవిత నాటకంలోని చివరి అంకంలోనికి ప్రవేశించిన అన్నపూర్ణమ్మకు పక్షవాతం వచ్చింది.... కొన్ని గంటలకే రెండోసారి... కొన్ని రోజులకే మూడో సారి.

తల్లిని ఆ పరిస్థితిలో చూడవలసి రావడంతో ఎంతగానో క్రుంగిపోయాడు. సమర్థురాలైన భార్య ఆమెకు అన్ని విధాలా సేవలు చేస్తూ సహకరిస్తున్నా అతనిలోని వేదన తగ్గలేదు. ఇల్లు కట్టిన కొన్ని నెలలకే తల్లికి అనారోగ్యం చేయడం అతన్ని వేధించసాగింది. నిజం చెప్పాలంటే అతనికిప్పుడు ఇల్లు కట్టే తాహతు లేకపోయినా ఆవిడ సంతృప్తి కొరకు లోన్లు పెట్టి పని పూర్తి చేశాడు. ఆవిడ అభిరుచి మేరకు చక్కని పాలిష్ మార్బుల్ స్టోన్స్ పరిపించాడు. కానీ ఆవిడ ఇప్పుడు తనకు తానుగా లేవలేని స్థితి. మరొకరి ఆధారం కావాలి. కాళ్ళు వశం తప్పడంతో నడవలేక పోతోందావిడ. అదీ కాలు పెడితే జారిపోయే ఆ రాళ్ళ మీద మరొకరి సహాయం ఉన్నా సరే చాలా ఇబ్బంది పడుతోందామె. ఒకటి రెండు సార్లు వాటి మీద నడుస్తూ వశం తప్పి పడిపోతోంటే అతి కష్టం మీద పట్టుకొని ఆపగలిగారు చిట్టిబాబు, లలిత.

"లలితా ఈ ఇంట్లో ఇక ఉండలేనే. ఈ నేల మీద నడవడం చాలా కష్టంగా ఉంది. అడుగు పడడం లేదు. గోడ పట్టుకు నడుద్దామన్నా అవకాశం లేనంత చదునుగా ఉంది. వాడితో మాట్లాడి నన్ను మరో ఇంటికి మార్చే ఏర్పాటు చేయవూ! నీకు పుణ్యం ఉంటుంది. కొడుకు కట్టు కున్న ఇంట్లోకన్ను మూసే యోగ్యత నాకు లేదేమో" అత్తగారి ఆర్తిని చూచి చలించి పోయింది లలిత.

తల్లి మాటల్ని భార్య ద్వారా విన్న చిట్టిబాబు మనసు వికలమైపోయింది. "అసలు ఈ ఇల్లు కట్టకుండా ఉండి ఉంటే పోయేదేమో. కట్టిన వెంటనే తల్లికి పక్షవాతం వచ్చింది. ఆమెకు తృప్తి లేని ఈ ఇంటిలో తానెలా ఉండగలడు. ఒక విధంగా అద్దె కొంపలోనే ఆనందంగా ఉండేవాళ్ళం" ఊహిస్తున్న చిట్టిబాబుకు అద్దె ఇల్లు దానిలోని అగచాట్లు తనకిప్పుడు గుర్తుకు రావడం లేదు. తల్లి ఇక్కడ ఎలాగూ బాధపడుతోంది. కనీసం ఇంతకు ముందు ఉండి వచ్చిన ఆ చాలీ చాలని ఇంటిలో ఉన్నంతలో బాగా తిరగ గల్గుతుందేమో.

అదే పనిగా ఆలోచిస్తున్న చిట్టిబాబు మనసు గట్టి పడడంతో ఓ నిర్ణయానికి వచ్చాడు.

తమకు ప్రస్తుతానికి ఆ ఇల్లు ప్రాప్తం లేదనుకొని తీరని కోరికతో దాన్ని అద్దెకిచ్చి తల్లి కోసం పూర్వాశ్రమం వైపు నడక సాగించాడు.